క్లుప్తంగా

ఇంటి స్థలాలివ్వాలని ఎమ్మెల్యేకు వినతి

శ్రీకాళహస్తి: తమకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఎల్ఐసీ ఏజెంట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన్ను ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తాము ఎల్ఐసీ ఏజెంట్లుగా పనిచేస్తున్నామని ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ నాయకులు చిట్టిబాబు, గోపి, సుధాకర్‌నాయుడు, వాణిశ్రీ, విజయశాంతి, కుమారి, సునీల్, వినతి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

నారాయణవనం: మండలంలోని ఆలయాల్లో గురువారం అమావాస్య పూజలను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాలను పంపిణీ చేశారు. స్థానిక సారకాయలస్వామి ఆలయంలో ఉదయం మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అలాగే వీరరాఘవస్వామి దేవస్థానంలో మధ్యాహ్నం జరిగిన అమావాస్య పూజల్లో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. కైలాసనాథకోనలోని శివశక్తి, శాంతి ఆశ్రమాల్లో అమావాస్య పూజలను నిర్వహించారు. కై లాసనాథకోనకు వచ్చిన భక్తులు, పర్యాటకులు ఆశ్రమాల్లో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పద్యాల మాధుర్యాన్ని పెంచాలి



మాట్లాడుతున్న జీవీ ప్రభాకర్‌రెడ్డి

ఏర్పేడు: పద్యాల మాధుర్యాన్ని పెంచాలని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి జీవీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో అష్టావధానం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పద్యాలు, పాటలు నేర్పించడం ద్వారా వారిలో నైతిక విలువలు, జ్ఞాపక శక్తిని పెంచవచ్చని సూచించారు. తెలుగువారి ఆస్తి అవధానమన్నారు. ప్రతి పాఠశాలలో అవధానం నిర్వహించడం ద్వారా విద్యార్థులకు తెలుగు మాధుర్యం తెలుస్తుందన్నారు. అనంతరం పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో ఆముదాల మురళి, టెంకాయల దామోదరం, శ్రీమన్నారాయణ, ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అభయక్షేత్రంలో అన్నదానం



రేణిగుంట: స్థానిక బిస్మిల్లానగర్‌లో ఉన్న అభయ క్షేత్రంలో దివ్యాంగులు, అనాథలకు గురువారం అన్నదానం చేశారు. ఏర్పేడు మండలం మాధవ మాలకు చెందిన తమ గురువు కొయ్యబొమ్మల కళా ప్రావీణ్యులు చిన్న ఆచ్చారి శుభస్వీకరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆయన శిష్యుడు పాముల శివయ్య అభయక్షేత్రంలోని 200మందికి అన్నదానం చేశారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో గురువారం యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ దేవీప్రియాంక జన్మదినం సందర్భంగా ఎస్టీ కాలనీలోని 15 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్, వినోద్ అరుణ, ముత్యాలమ్మ, విక్కీ, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

నాగలాపురం: మైనరు బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్న ఓ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాలు.. మండలంలోని కృష్ణాపురం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన బాలిక(14) స్థానిక ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. విద్యార్థిని తల్లిదండ్రులు గతంలోనే మరణించడంతో పిన్ని సంరక్షణలో ఉంటోంది. అయితే ఈమె తమ్ముడు కేవీబీపురం మండలం దిగువ పూడి ఎస్సీకాలనీకి చెందిన మునస్వామి(24) బాలికకు మాయమాటలు చెప్పి లోబరచుకున్నాడు. ఈ నెల 8వ తేదీన విద్యార్థిని వెళ్లే పాఠశాల దగ్గర కాపుగాచి బాలికను తీసుకెళ్లి సురుటుపల్లి ఆలయంలో పెళ్లి చేసుకున్నాడు. అయితే విషయం తెలిసి బాలిక అవ్వ వసంత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేశారు. పోలీసులు గాలించి గురువారం బాలికను అవ్వ వసంతకు అప్పగించారు. అలాగే మునస్వామిని అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించినట్లు సీఐ శివకుమార్ రెడ్డి తెలిపారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



లబ్ధిదారుకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత పొందిన వారి గడప గడపకు సంక్షేమ ఫలాలు తలుపు తడుతున్నాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం ఆయన రేణిగుంట పట్టణం వేణుగోపాలపురం, శివకుమార్ నగర్‌లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. తొలుత వేణుగోపాలపురం వద్ద సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆయనకు క్రేన్ సహాయంతో గజమాల వేసి, ఘన స్వాగతం పలికారు. పూలవర్షం కురిపించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి నవరత్న పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ప్రతి ఇంటా ఆయన్ను సాదరంగా ఆహ్వానించి జగనన్న పాలనలో పథకాలు నేరుగా ఇంటికే చేరుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. సంక్షేమ ప్రదాత జగనన్నకు వచ్చే ఎన్నికల్లో తోడుగా నిలిచి మరోసారి గెలిపించుకుంటామని ఎమ్మెల్యేకు మాటిచ్చారు. ఎవరైనా అర్హులై ఉండి సాంకేతిక కారణాల చేత పథకాల లబ్ధి పొందకుంటే వారి ఫిర్యాదులను ప్రత్యేకంగా స్వీకరించి 'ప్రజా దర్బారు' కార్యక్రమం ద్వారా సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, రసూల్, ఖదీర్, మాజీ ఎంపీటీసీ నాగరాజు, ఎంపీటీసీ సుందరమూర్తి, ఆనందరావు, వంశీ, కృష్ణమూర్తి, కుట్టి, శ్రీకాంత్, ఈశ్వరమ్మ, జగన్, మల్లిరెడ్డి, ఇరానీ ఖాదర్, శ్రావణి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి హీరో జగనన్న...!

ఈ రోజు పరిణామాలు చూస్తుంటే జగనన్నే పేదవాడి హీరోగా, సినిమాల్లో హీరోలుగా చెప్పుకునే వ్యక్తులు రాజకీయాల్లో ప్రజల పట్ల విలన్లుగా మారారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడారు. గడప గడపకు వెళుతుంటే ప్రతి ఇంటా పథకాలు అందుతున్నాయని ప్రజలు సంతోషంగా అక్కున చేర్చుకుని పూలమాలలు వేసి ఆదరిస్తుండడం చూస్తుంటే జగనన్న కృషి ఫలితమేనన్నారు. ప్రజాదరణ రోజు,రోజుకూ పెరుగుతోందని 90శాతం మంది ప్రజలు జగనన్న పాలనలో సంతోషంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. అయితే ఎంత మంది ఒక్కటైనా 2024 ఎన్నికల్లో జగనన్న ప్రజల మద్దతుతో మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. సినిమాల్లో హీరో ఒక్కడే ఉంటారు.. విలన్లు పది మంది ఉంటారు.. సినిమాలోల మాత్రం హీరో అని చెప్పుకునే వాళ్లు నిజజీవితంలో విలన్‌గా తయారవుతున్నారన్నారు. జగనన్న రాజకీయాల్లో హీరో.. మంచితనానికి హీరో.. పథకాల హీరో.. పేదవాడి హీరో అని అన్నారు. ఆయన వెంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

సత్యవేడు: మండలంలోని ఇరుగుళం సచివాలయ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని ఎంపీపీ ప్రతిమ, మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం వారు స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఇరుగుళం గ్రామ పరిధిలో ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటిస్తారని తెలిపారు. సత్యవేడులో శుక్రవారం ఎమ్మెల్యే ఆదిమూలం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తారని అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు బందెల బాలయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ



రేణిగుంట మండలం కరకంబాడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీలో నూతనంగా మంజూరైన పింఛన్లు 65మందికి గురువారం మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కరకంబాడి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పవిత్రారెడ్డి చేతులమీదుగా పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ కేవలం కరకంబాడి పంచాయతీ పరిధిలోనే 1,601 మంది ప్రతి నెలా 1వ తేదీ రూ.45లక్షల 5వేలు పెన్షన్ రూపంలో అందుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో పింఛను తీసుకుంటున్న వారిలో ఎవరో ఒకరు చనిపోతేనో, జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులకు ముడుపులు ఇస్తేనో పింఛన్లు కొత్తగా మంజూరు చేసే పరిస్థితులను ఆమె గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ ఈశ్వరమ్మ, ఎంపీటీసీలు శ్రావణి, కన్నయ్య, నాయకులు మన్యం శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్రమణ్యం, శివ, పీడీ బాబు, పార్థసారథి, మహేష్, కాలేషా, అమ్ములమ్మ, తహసీనా, సాహిదా పాల్గొన్నారు.

అత్తూరులో..

మండలంలోని అత్తూరులో నూతనంగా మంజూరైన పింఛన్లు ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రసాద్, కార్యదర్శి వెన్నెల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామ సచివాలయంలో గురువారం జిల్లా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జొన్నల గోపాల్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ కొత్తగా మంజూరైన 15 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేసి, ఆదుకుంటున్నారని తెలిపారు.

బలిజల ఐక్యతను చాటుదాం

శ్రీకాళహస్తి: బలిజల ఐక్యతను చాటుదామని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో గురువారం పలువురు బలిజలు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అయ్యలనాడు చెరువులో బలిజల కోసం కేటాయించిన స్థలంలో భవన నిర్మాణం కోసం గురువారం సమావేశం నిర్వహించారు. బలిజ సంఘం కోసం ప్రాణాలు అర్పించిన వంగవీటి మోహన రంగ కాంస్య విగ్రహాన్ని ఆయన వర్ధంతి రోజు ఈ ప్రాంతంలోనే ఏర్పాటు చేస్తామన్నారు. రాజగోపురం వద్ద శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ బలిజల వద్దే నిధులు సేకరించి భవనాన్ని పూర్తిచేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తామన్నారు. శెట్టిపల్లి సురేష్, ముత్యాల పార్థసారథి, స్వర్ణమూర్తి, షణ్ముగం, పగడాల రాజు, గరికపాటి చంద్ర, సెన్నీరుకుప్పంశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగు పడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం స్వర్ణలత

సత్యవేడు: మండలంలోని 1237 డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళల జీవనప్రమాణాలు, పేద కుటుంబాల తలసరి ఆదాయం మెరుగు పడేలా గ్రామ సంఘాలు లీడర్లు చొరవ చూపాలని ఏపీఎం స్వర్ణలత కోరారు. గురువారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గ్రామ సంఘాల లీడర్ల సమావేశం జరిగింది. ఏపీఎం మాట్లాడుతూ సంఘాల సభ్యత్వం, పొదుపు, అప్పులు, వాటాధనం నిర్వహణపై అవగాహన కల్పించారు. స్త్రీనిధి వడ్డీ రేటు గతంలో 12 శాతం ఉండేదని, ప్రస్తుతం 11 శాతం వడ్డీ రేటు ఉందన్నారు. పీఎంజేజేబీవై పథకం ద్వారా సాధారణ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదంలో చనిపోతే రూ.4 లక్షల వరకు అందుతుందన్నారు. పీఎం ఎస్‌బీవై కింద 50 ఏళ్లు పైబడిన వారు మృతి చెందితే రూ.2 లక్షలు వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎస్.మేఘల, ఉపాధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి కోటీశ్వరి, సీసీ పయణి, ఎంఎస్ఏ నందిని, సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

ఏర్పేడు: మండలంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఏర్పేడు సీఐ శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక స్వామి విగ్రహాల ప్రతిష్ట, చవితి పందిళ్లు, మండపాలు ఏర్పాటు, నిమ్మజ్జనానికి పోలీస్ స్టేషన్ అధికారి అనుమతి పొందాలని సూచించారు. అనుమతుల కోసం ఐదుగురు కమిటీగా ఏర్పడి వారి గుర్తింపు కార్డుల నకలును అందజేయాలని చెప్పారు. వినాయచవితి ఉత్సవాల్లో మద్యం తాగి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉండాలన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు లౌడ్ స్పీకర్ల అనుమతి ఉంటుందన్నారు. నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా జాతీయ భాషా దినోత్సవం



శ్రీకాళహస్తి: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



ఏర్పేడు: బహుమతులందజేస్తున్న నిర్మల్‌కుమార్

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు పద్మావతి, సుబ్రహ్మణ్యం, సులోచనాదేవి, హసీనాబీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో నిర్వహించిన హిందీ దినోత్సవంలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ షెర్లీ పాల్గొన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాబుఅగ్రహారం పురపాలకసంఘ ఉన్నత పాఠశాల, ముచ్చివోలు, తొండమనాడు తదిదతర ఉన్నత పాఠశాలల్లో కూడా హిందీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

ప్రతి విద్యార్థి హిందీ నేర్చుకోవాలి

ఏర్పేడు: ప్రతి విద్యార్థి హిందీ నేర్చుకోవాలని ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్ అన్నారు. మండలంలోని బండారుపల్లి ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు హిందీ ఆవశ్యకతపై వివరించారు. విద్యార్థులకు హిందీ మాట్లాడంపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, ద్వారకానాథ్‌రెడ్డి, నాగభూషణమ్మ, ఉమామహేశ్వర్, కుమార్ రాజా, రామచంద్రయ్య, సురేష్, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివాస్

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం, అన్నాసామిపల్లి ఉన్నత పాఠశాలల్లో గురువారం హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నాసామిపల్లి హెచ్ఎం సునీత గౌడ్, గాజులలమండ్యం హెచ్ఎం వేణుగోపాల్ హిందీ భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. గాజులమండ్యం హైస్కూల్లో విద్యార్థులు థింసా నాటికను ప్రదర్శించారు. భారత ప్రభుత్వం 1949 సెప్టెంబర్ 14 నుంచి హిందీ భాషను అధికారిక భాషగా ప్రకటించి భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లత, మనోహర్, యాదయ్య, జనార్ధన్, రఘుపతి, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివాస్

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం, అన్నాసామిపల్లి ఉన్నత పాఠశాలల్లో గురువారం హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నాసామిపల్లి హెచ్ఎం సునీత గౌడ్, గజాఉలమండ్యం హెచ్ఎం వేణుగోపాల్ హిందీ భాష ఔన్నత్యాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. గాజులమండ్యం హైస్కూల్లో విద్యార్థులు థింసా నాటికను ప్రదర్శించారు. భారత ప్రభుత్వం 1949 సెప్టెంబర్ 14 నుంచి హిందీ భాషను అధికారిక భాషగా ప్రకటించి భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. హిందీ భాషను దేశంలోని అత్యధిక జనాభా మాట్లాడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లత, మనోహర్, యాదయ్య, జనార్ధన్, రఘుపతి, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

బుచ్చినాయుడుకండ్రిగ: హిందీ భాషా దినోత్సవాన్ని కల్లివెట్టు, నెలవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు మాధవీలత, శ్రీనివాసులు మాట్లాడుతూ మన దేశ జాతీయ భాష హిందీ అని, అత్యధికులు మాట్లాడే భాషగా 1949లో హిందీని రాజ భాషగా కేంద్రప్రభుత్వం ఆమోదించడంతో సెప్టెంబరు 14న హిందీ దివస్‌గా జరుపుకుంటున్నామని అన్నారు. అనంతరం పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం

నారాయణవనం: బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ముగింపు సమావేశంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సులోచన మాట్లాడుతూ మన దేశంలో హిందీకి జాతీయ భాషగా గౌరవిస్తూ విస్తరింపజేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. మన రాష్ట్రంలో కూడా పాఠశాల స్థాయి వరకు ఒక పాఠ్యాంశంగా హిందీని అమలుచేస్తూ, జాతీయ స్థాయిలో మన విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. విద్యార్థులందరూ వివిధ హిందీ భాషా ప్రయోగాలను, అక్షర అభ్యాసాలను ప్రదర్శించారు. హిందీ ఉపాధ్యాయులు వెంకటరమణ, పర్వీన్ బేగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్, లోకనాథ్ రాయల్, ప్రభాకర్ నాయుడు, సురేష్ బాబు, జయప్రకాష్ పాల్గొన్నారు.

పుష్ప పల్లకిలో అవనాక్షమ్మ



పుష్ప పల్లకిలో అవనాక్షమ్మ



ఆలయ మర్యాదలను అందుకుంటున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం: నారాయణవనంలోని కోటవీధి అవనాక్షమ్మ గురువారం రాత్రి పుష్ప పల్లకిని అధిరోహించి గ్రామోత్సవంలో దర్శనమిచ్చారు. కోటవీధి అవనాక్షమ్మ ఆలయ వార్షిక జాతరను మూడు రోజుల పాటు సెంగుందర్ కులస్థులు నిర్వహిస్తారు. జాతరలో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో అవనాక్షమ్మకు అభిషేకాలను నిర్వహించి దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం చెన్నై, కంచి నుంచి తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పుష్ప పల్లకిని అమ్మవారు అధిరోహించారు. కోలాటాలు, నాధస్వరం, కేరళ వాయిద్యాల మధ్య అమ్మవారు కోట, చిత్రాంగి, రత్నాంగి, సెంగుందర్ వీధుల్లో విహరిస్తూ హారతులను అందుకున్నారు. ఈ ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ పరమేష్‌నాయక్ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు. చివరి రోజైన శుక్రవారం ఉదయం అభిషేకం, రాత్రి అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

అమ్మవారి సేవలో ఎమ్మెల్యే

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం రాత్రి అవనాక్షమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనను సెంగుందర్ ఉత్సవ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అమ్మవారిని అర్చించి, మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యేని ఉత్సవ కమిటీ శాలువలు కప్పి సత్కరించి, ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలను అంజేసింది. ఆదిమూలంతో పాటు ఎంపీపీ దివాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆరోగ్యకరమైన భూమిలోనే అధిక దిగుబడులు

శ్రీకాళహస్తి: ఆరోగ్యకరమైన భూమిలోనే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య అన్నారు. ఆత్మ సహకారంతో మండలంలోని వేడాం గ్రామంలో ఆయన రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వరిలో అవసరానికి మించి రసాయన ఎరువులు, కలుపు మందులు, గుళికలు వాడటం వలన భూమి పాడైపోతుందన్నారు. దీంతో భూములు సాగుకు పనికి రాకుండా పోతాయని చెప్పారు. పశువుల ఎరువు, పచ్చిరొట్ట, జీవన ఎరువుల అధికంగా వాడటం వలన నేల సారవంతమవుతుందన్నారు. రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్నాయన్నారు. సాగులో అనవసర ఖర్చులు తగ్గిస్తేనే ఆదాయం పెరుగుతుందని ఏడీఏ భాస్కరయ్య అన్నారు. తొట్టంబేడు మండలం పూడి గ్రామంలో ఆత్మ సహకారంతో ఆయన రైతులకు శిక్షణ ఇచ్చారు. రైతులు వరిలో అధికంగా ఎరువులు వేసినా, పైరు అవసరమైన వరకే తీసుకుని మిగతా వృథాగా పోతోందని చెప్పారు. దీని వలన రైతుకు ఖర్చు తప్ప ఆదాయం పెరగదన్నారు. శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రబీకి రైతులకు అవసరమైన ఎరువులు ఆర్‌బీకేల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాల్‌రావు, ఇఫ్కో జిల్లా క్షేత్రాధికారి మణి, వ్యవసాయాధికారులు సుధాకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, గ్రామ సహాయకులు బాలునాయక్, కవిత పాల్గొన్నారు.

వైభవంగా అమావాస్య ఉత్సవం



స్వామి అమ్మవార్లు అమావాస్య ఉత్సవంలో పాలక మండలి సభ్యులు, అధికారులు, అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం వైభవంగా అమావాస్య ఉత్సవం జరిగింది. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప,దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్టించి, ఊరేగించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను ప్రజలు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: క్రీడలతోనే మానసికోల్లాసం లభిస్తుందని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్కాట్ శంకర్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు విద్యపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలని కోరారు. ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య మాట్లాడుతూ మండల పరిధిలో అండర్–14, 17 విభాగాల్లో పలు అంశాల్లో మండల స్థాయి క్రీడల పోటీలు నిర్వహించి ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో కారణి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

నాగలాపురం: మండల పరిధిలోని కారణి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ చూపడంతో ఆ స్కూల్ హెచ్ఎం జయకుమారి అభినందించారు. నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 67వ ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కారణి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జయకుమారి మాట్లాడుతూ తమ స్కూల్ విద్యార్థులు క్రీడల్లో రాణించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమం పీడీ దాము, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బేతేలు ప్రార్థనా మందిరం ప్రారంభం



చర్చి నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: మండలంలోని ఎల్లమండ్యం పంచాయతీలో నూతనంగా నిర్మించిన బేతేలు ప్రార్థన మందిర భవనాన్ని గురువారం మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి ప్రారంభించారు. చర్చి ఫాదర్ నాగరాజు మాట్లాడుతూ తమ చర్చి నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళితే, ఆయన తక్షణమే స్పందించారన్నారు. స్థలం కేటాయించారా..? లేదా..? అని బియ్యపు పవిత్రారెడ్డి తమకు తరచూ ఫోన్లు చేసి అడగటమే కాకుండా కొద్ది రోజుల వ్యవధిలోనే స్థలం ఇప్పించి, చర్చి నిర్మాణానికి తగిన సాయం చేశారన్నారు. బియ్యపు పవిత్రారెడ్డి మాట్లాడుతూ ఏ సాయం కావాలన్నా తాము అందుబాటులో ఉంటామని, ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని స్పష్టం చేశారు. ఏసు ప్రభువు అందరిని చల్లగా చూడాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, గంగయ్య, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, జాన్‌బాబు, గుణ, కృష్ణమూర్తి, శశికిరణ్, ఇన్బనాధన్, సుందరమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డీకేటీ భూములను స్థానికులకే ఇవ్వాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాగలాపురం: మండలంలోని డీకేటీ లేదా ప్రభుత్వ భూములను పేదలకు అందించి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ మండలం నాయకులు కోరారు. గురువారం వారు తహసీల్దారు ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ముఖ్యంగా కడివేడు రెవెన్యూ లెక్కదాఖలాలో ఉన్న ప్రభుత్వ భూములను వేరే పంచాయతీకి చెందిన వ్యక్తుల పేరిట పట్టాలు ఇవ్వడానికి తహసీల్దారు కార్యాలయంలోని కొంతమంది సిబ్బంది సహకరిస్తున్నారని తెలిపారు. అలా కాకుండా ఆయా రెవెన్యూ గ్రామానికి సంబంధించిన వీఆర్‌ఓలకు చెప్పి పేదలను గుర్తించి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సింధుశ్యామ్, మేజర్ పంచాయతీ సర్పంచ్ సుధాచిన్నదొరై, వైస్ ఎంపీపీ ధ్యానవేలు, రాజులకండ్రిగ ఎంపీటీసీ రవికుమార్, సర్పంచ్ భాస్కర్ రాజు, సోషల్ మీడియా ప్రతినిధి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.